క్లుప్తంగా

మంచినీటి కుళాయిలో పురుగులు


కుళాయి నీటిలో వచ్చిన తోక పురుగులు


కుళాయి తొలగించిన దృశ్యం

రామచంద్రపురం రూరల్: మండలంలోని మేజర్ పంచాయతీ ద్రాక్షారామలో రక్షిత మంచినీటి కుళాయి నీటి నుంచి తోక పురుగులు వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్రాక్షారామ ప్రధాన రహదారిలో శివ రంజనీ థియేటర్ సమీపంలోని మంచినీటి కుళాయి వద్ద శుక్రవారం స్థానికులు మంచినీరు పడుతుండగా తోక పురుగులు రావడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. దీనిపై సర్పంచ్ కొత్తపల్లి అరుణ, పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణలకు ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారానికి పంచాయతీ సిబ్బంది అనుసరించిన పంథా చూసి అవాక్కవ్వడం ప్రజల వంతైంది. పంచాయతీ సిబ్బంది ఇక్కడ మొత్తం కుళాయి తొలగించడంతో ఇదేం పరిష్కారం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం


సమావేశంలో పాల్గొన్న నాయకులు, అధికారులు

రామచంద్రపురం: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ పీసీఆర్ అండ్ పీఓఏ యాక్ట్–1989 ప్రకారం నిర్వహించాల్సిన డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ దేవరకొండ అఖిల అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. డివిజనల్ పరిధిలోని మండలాల్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, వాటి పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. మీ పరిధిలోని వసతి గృహాల స్థితిగతులు పరిశీలించాలని ఎంపీడీఓలు, తహసీల్దార్లను ఆర్డీఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఎస్సీ, ఎస్టీ నాయకులు, డీవీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రాయవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన శుక్రవారం తెలిపారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ శాఖాపరమైన విషయాలను సభ్యులకు తెలియజేయాల్సి ఉన్నందున పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆమె సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కపిలేశ్వరపురం (మండపేట): మండలంలోని ఏడిద గ్రామంలో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్టు విద్యుత్ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాల రావు శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్ల వెంబడి చెట్ల కొమ్మలను తొలగించే నిమిత్తం ఏడిద, సీతానగరం, సావరం, కొత్తూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శాకంబరిగా దర్శనమిచ్చిన పోలమ్మ తల్లి



రాయవరం: గ్రామంలో కొలువైన పోలమ్మ అమ్మవారు శుక్రవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం శుక్రవారం పురస్కరించుకొని పోలమ్మ తల్లి యూత్ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని కూరగాయలతో అలంకరించినట్లు పోలమ్మ ఆలయ కమిటీ చైర్మన్, ఎంపీపీ నౌడు వెంకటరమణ తెలిపారు. అమ్మవారిని 300 కేజీల వివిధ రకాల పండ్లు, కూరగాయాలు, ఆకుకూరలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు వచ్చారు.

మోసానికి మారుపేరు చంద్రబాబు

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తుంటే కూటమి నేతలకు దడ పుడుతోంది
- హామీలను విస్మరిస్తే జనంతో కలసి ఉద్యమిస్తాం
- నాయకులు, కార్యకర్తలను వేధిస్తే సంహించం
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


మండపేటలో క్యూఆర్ కోడ్ ఉన్న చార్టులను ప్రదర్శిస్తున్న బొత్స, తోట తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): మోసానికి మారుపేరు చంద్రబాబు అని కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో సామాజిక పింఛన్లు తప్ప ప్రధాన హామీలన్నీ ఏడాది కాలంలో అమలుకు నోచుకోలేదని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేటలోని సూర్య కన్వెన్షన్ హాల్లో శుక్రవారం బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, పార్టీ జిల్లా పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, నియోజకవర్గం పరిశీలకుడు కంఠంశెట్టి ఆదిత్య, జిల్లాలోని పలు నియోజకవర్గాల నాయకులు హాజరయ్యారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతిమకు పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అతిథులకు మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు. మండపేటలోని 30 వార్డులు, మండపేట రూరల్ మండలంలోని 12 గ్రామాలు, కపిలేశ్వరపురం మండలంలో 19, రాయవరం మండలంలో 12 గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు, సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. బొత్స సత్యనారాయణ ప్రొజెక్టర్‌లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ సంయుక్తంగా ఇచ్చిన హామీలను ప్రదర్శించి వాటిని విస్మరించారని విమర్శించారు.

అప్రజాస్వామిక చర్యలను నిలదీస్తాం

ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అప్రజాస్వామికంగా నడుచుకుంటున్నవారిని రానున్న రోజుల్లో ప్రజల్లో నిలదీస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి మాట్లాడుతూ వైఎస్ జగన్ కంటే రెట్టింపు సాయం చేస్తామన్న చంద్రబాబు ప్రభుత్వం మద్యం పేరుతో కోట్లు గడిస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే బిక్కిన కష్ణార్జున చౌదరి, నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కర్రి పాపారాయుడు, రెడ్డి రాధాకృష్ణ మాట్లాడుతూ మండపేట నియోజకవర్గం వైఎస్సార్ హయాంలో చేసిన అభివృద్ధిని వివరించారు. పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చి వైఎస్ జగన్‌ను సీఎం చేసుకునేందుకు కృషి చేద్దామన్నారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ నిరంతరం జనంలోకి వెళ్లి పోరాడే నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మండపేట నియోజకవర్గంలో కూటమి అప్రజాస్వామిక పాలనపై పోరాడుతున్న ఎమ్మెల్సీ తోటను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తెన్నేటి కిశోర్, జిల్లా ఉపాధ్యక్షుడు దూలం వెంకన్న బాబు, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీలు పలివెల మధు, కొప్పిరెడ్డి వెంకటరమణ శివప్రసాద్, జిల్లా యాక్టివిటీ సెక్రటరీలు టేకిమూడి శ్రీనివాసరావు, గుడిమెట్ల శివరామకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు నల్లమిల్లి మంగాతాయారు, కుడుపూడి భవాని, ఎంపీపీలు మేడిశెట్టి సత్యవేణి, నౌండ్రు వెంకటరమణ, ఉండమట్ల శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు గూటం సత్యనారాయణ, పిల్లి శ్రీనివాస్, అడబాల బాబ్జీ, వెలగల సత్యనారాయణరెడ్డి, నక్కా సింహాచలం, ఓగిరాల దేవి, పోతంశెట్టి ప్రసాద్, పార్టీ రాష్ట్ర, జిల్లా పలు విభాగాల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, గ్రామ, మండల, జిల్లా స్థాయి పలు విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ప్రతి పనికీ పర్సెంటేజీ


ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ మండపేట నియోజకవర్గంలో మద్యం ఏరులై పారుతోందని, మున్సిపల్ కార్యాలయం సమీపంలో మద్యం షాపులు ఏర్పాటు చేయడం కూటమి పాలనకు అద్దం పడుతోందన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల, ఇతర కూటమి నేతలు ప్రతి పనికీ పర్సెంటేజీ తీసుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు చేసిన పనులకు ప్రభుత్వం నుంచి బిల్లులు రాకుండా అధికారుల ద్వారా అడ్డుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో సాగుతున్న ఇసుక అక్రమాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నా పాలకుల తీరు మారడం లేదన్నారు. నాయకులు, కార్యకర్తలను కేసుల పేరుతో వేధిస్తే సంహించేది లేదని ఆయన హెచ్చరించారు. కూటమి పాలనలో ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. రైతులు, ఇతర వర్గాల సమస్యలపై వైఎస్ జగన్ జనంలోకి వచ్చి పోరాడుతుంటే కూటమి నేతలకు దడ పుడుతోందన్నారు. 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తాననీ, మహిళలకు ఉచిత బస్సు, రైతులకు అన్నదాత సుఖీభవ తదితర హామీలు అమలు కాలేదన్నారు. పెన్షన్ సొమ్ము రూ.వెయ్యి పెంచానని గొప్పలు చెబుతున్న నేతలు రాష్ట్రంలో ఐదు లక్షల పెన్షన్లను రద్దు చేసిన విషయాన్ని గమనించాలన్నారు. వైఎస్ జగన్ పాలనలో కాలనీలు నిర్మిస్తే చంద్రబాబు ఒక్క ఇల్లు కూడా కట్టలేదన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోసు, జక్కంపూడి విజయలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

కూటమి నేతల మోసాలను
ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టాలి


బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను కార్యకర్తలకు అందజేస్తున్న సూర్యప్రకాశ్


సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కాజులూరు: కూటమి నాయకులు మాయ మాటలు చెబుతూ, అబద్ధాలతో ప్రజలను ఎల్లకాలం మోసం చేయలేరని, వారి కుట్రలను ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాజులూరు అంబేడ్కర్ భవనంలో వైఎస్సార్‌సీపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

తప్పుడు వాగ్దానాలతో గద్దెనెక్కిన టీడీపీ


ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ, ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో తప్పుడు వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన టీడీపీ నాయకులు వాటిని అమలు చేయలేక అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. కూటమి పాలకులు చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రతి ఇంటికీ తీసుకెళ్లేందుకే పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఉమ్మడిగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ పథకాలన్నీ కొనసాగిస్తూ.. వారికంటే మరిన్ని పథకాలు అదనంగా అమలు చేస్తామని సూపర్ సిక్స్ పేరుతో పలు పథకాలు ప్రకటించి బాండ్లు ఇచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ఇప్పుడు ఇంటింటికీ వెళ్లి ఆ బాండ్లలో ఉన్న పథకాలు మీ ఇంట్లో లేదా సన్నిహితులకైనా అందుతున్నాయా అని ప్రజలకు తెలియజేస్తూ క్యూఆర్ కోడ్‌ను వారి సెల్ ఫోన్‌లోనే స్కాన్ చేస్తూ బాబు అబద్ధపు మోసాలను తెలియజేయాలన్నారు. విజ్ఞులైన ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. మండలంలోని గ్రామాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు సీతారాముల దివ్య కల్యాణం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద గత నెల 2 నుంచి ఈ నెల 21 వరకు శ్రీప్రసన్నాంజనేయ స్వామి సప్త సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం ఉదయం ఎనిమిది గంటలకు దాతలు మంచం ఆంజనేయమూర్తి (చిన్నబాబు) దంపతులు సీతారాముల దివ్య కల్యాణం కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు ప్రసన్నాంజనేయ బాల భక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీను శుక్రవారం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం రామయ్య దివ్య కల్యాణ రథం ఆలయ ప్రాంగణానికి చేరుకుంది. రథాన్ని పూలదండలతో సర్వాంగ సుందరంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ సిబ్బంది మేళతాళాలతో రథానికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, భద్రాచలం రామాలయ ఈఓ ఎల్.రమాదేవి పాల్గొనున్నట్లు తెలిపారు. కల్యాణానికి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదికను సిద్ధం చేస్తున్నామన్నారు.

21న శాంతి కల్యాణం

అదే విధంగా సప్త సప్తాహం ముగింపు పురస్కరించుకుని ఈ నెల 21న సప్త సప్తాహ మహోత్సవ పూర్ణాహుతి, సీతారాముల శాంతి కల్యాణం, సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమాలు ఎమ్మెల్సీ, ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం గౌరవాధ్యక్షుడు తోట త్రిమూర్తులు, సూర్యకుమారి దంపతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.


రామయ్య కల్యాణానికి సిద్ధమవుతున్న వేదిక


భీమేశ్వరాలయం వద్దకు చేరుకున్న కల్యాణ రథం


రామయ్య కల్యాణ రథంతో ద్రాక్షారామలో నగరోత్సవం

మానవ అక్రమ రవాణాపై
అప్రమత్తంగా ఉండాలి

కపిలేశ్వరపురం (మండపేట): ద్వారపూడి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం అలెర్ట్ ఎన్‌జీఓ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్లాట్‌ఫారంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. మానవ అక్రమ రవాణా పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్‌పీఎఫ్ ఎస్ఐ విశ్వనాథ్ అన్నారు. స్టేషన్ మాస్టర్ నీరజ్, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ విశ్వనాథ్, ఎన్‌జీఓ సంస్థ స్టేట్ కో–ఆర్డినేటర్ శీలా శ్రీను, జిల్లా కో–ఆర్డినేటర్ బి.నాగార్జున, ద్వారపూడి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, డీసీపీయూ ఎం.లక్ష్మణ్ పాల్గొన్నారు. మానవ విలువలను మరచిన నేర ప్రవృత్తిగల వారి నుంచి చిన్నారులు, మహిళలు తదితరులను ఎప్పటికప్పుడు కాపాడుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


రైల్వే ప్లాట్‌ఫారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉపాధ్యాయులకు ఘన సత్కారం

రాయవరం: అంకితభావంతో విధులు నిర్వర్తించే వారికి విద్యార్థుల మనస్సుల్లో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని సర్పంచ్ సీతామహాలక్ష్మి పేర్కొన్నారు. ఇటీవల పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. హెచ్ఎం సాపిరెడ్డి ముత్యాలరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పి.వీరబ్రహ్మం, ఎస్ఎంసీ కో–ఆప్షన్ సభ్యులు సత్తి భామిరెడ్డి మాట్లాడారు. బోధన ద్వారా విద్యార్థుల మనస్సుల్లో చెదరని స్థానం ఏర్పరుచుకున్న ఉపాధ్యాయుల సేవలను ప్రశంసించారు.

ఈ ఏడాది ట్రిపుల్ ఐటీకి ఐదుగురు విద్యార్థులు ఎంపిక కావడానికి కృషి చేసిన ఉపాధ్యాయుల సేవలు మరువరానివన్నారు. ఈ కార్యక్రమంలో మేడపాటి శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ త్రీమెన్ కమిటీ చైర్మన్ మేడపాటి రవీంద్రారెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సత్కరించిన అధికారులు

తండ్రిపై సుత్తితో తనయుడి దాడి

రాయవరం: ప్రవర్తన మార్చుకోమని చెప్పిన తండ్రిపై తనయుడు సుత్తితో విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన రాయవరంలో జరిగింది. ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రాజరాజేశ్వరికాలనీలో గంటా శ్రీను భార్య, పిల్లలతో నివాసముంటున్నాడు. శ్రీను గురువారం రాత్రి భోజనం చేస్తున్న సమయంలో ప్రవర్తన మార్చుకోమంటూ తండ్రి హెచ్చరించడంతో ప్రతి రోజూ తిడుతున్నావంటూ కుమారుడు ఆగ్రహంతో సుత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో శ్రీను తీవ్రంగా గాయపడటంతో రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తండ్రిపై దాడికి పాల్పడిన పవన్‌కల్యాణ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెదజల్లు.. రైతన్నకు మేలు

- కలుపు తీవ్రతపై రైతుల ఆందోళన
- నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు


కాజులూరులో వెదజల్లిన వరిపొలం


వెదజల్లిన పొలంలో కలుపు నివారణకు మందులు పిచికారిచేస్తున్న రైతులు

కాజులూరు: ఓల్డ్ ఈజ్ గోల్డ్ అనే నానుడికి ప్రస్తుత రైతులు ప్రాధాన్యత ఇస్తున్నారు. రామచంద్రాపురం నియోజకవర్గ గ్రామాల్లోని అధిక శాతం రైతులు వరి పంట సేద్యంలో పురాతన పద్ధతి అయిన వెదజల్లిక విధానాన్ని చేపడుతూ ఈ నానుడిని నిజం చేస్తున్నారు. వెదజల్లిన వరిపొలాల్లో కలుపు బెడద తీవ్రమైన సమస్యగా మారింది. అయితే వరి మొక్కకు నష్టం వాటిల్లకుండా కలుపు మొక్కలను నిర్మూలించే రసాయన మందులు అందుబాటులోకి రావడంతో రైతులు వాటిని వినియోగించుకుంటూ వెదజల్లిక విధానాన్ని చేపడుతున్నారు. దీనికి తోడు ఇటీవల కాలంలో తొలకరి సాగు ఆలస్యమై పంట చివరి దశలో నవంబర్, డిసెంబర్ నెలల్లో తుపాన్లు బారిన పడుతుండటంతో పంటసాగు త్వరగా పూర్తి చేయాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తక్కువ కాలంలో పంట దిగుబడికి వచ్చేలా రైతులు సాగు చేపట్టాలని, అందుకు వెదజల్లిక విధానం శ్రేష్ఠమైనదని వ్యవసాయాధికారులు సూచించటంతో రైతులు ఆ దిశగా ప్రయత్నం చేపట్టారు.

వెదజల్లిక విధానాన్నే..

రామచంద్రపురం నియోజకవర్గంలో 52 వేల ఎకరాల సాగుభూమి ఉండగా.. ప్రస్తుత ఖరీఫ్‌లో తొలి దశ అయిన నాట్లు, వెదజల్లిక ప్రక్రియ ముమ్మరంగా సాగుతుంది. కాజులూరు మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 18,500 ఎకరాల్లో రైతులు వరిసాగు చేపడుతుండగా.. ఇందులో సుమారు 85 శాతం పొలాల్లో రైతులు వెదజల్లిక విధానాన్నే అవలంబిస్తున్నారు. కె.గంగవరం మండలంలో 60 శాతం, రామచంద్రపురంలో 70 శాతం మంది రైతులు వెదజల్లిక విధానాన్ని పాటిస్తున్నారు. సాధారణ పద్ధతిలో రైతులు దుక్కుదున్ని, పొలాన్ని చదునుచేసి నాట్లు వేస్తారు. ఈ విధానంలో కలుపు తీవ్రత తక్కువగా ఉంటుంది. అయితే వెదజల్లిన పొలాల్లో వరి మొక్కతోపాటు కలుపు మొక్క సమాంతరంగా పెరుగుతుంది. ఈ కలుపు మొక్కలను సకాలంలో నివారించకుంటే అవి ఎరువులను, భూమిలోని పోషకాలను ఉపయోగించుకుని క్రమేపి వరి మొక్కలను అధిగమించి పెరుగుతాయి. నియోజకవర్గ గ్రామాల్లో వెదజల్లిన పొలాల్లో కలుపు తీవ్రత ఊహించిన దాని కంటే ఎక్కువగానే ఉందని రైతులు చెబుతున్నారు. కొన్ని రకాల కలుపు మొక్కలను నివారించడం కష్టతరంగా ఉందంటున్నారు. తెలిసి, తెలియని రసాయనిక మందులు వాడితే కలుపు మొక్కతోపాటు, వరిమొక్క చనిపోతుందని రైతులు భయాందోళన చెందుతున్నారు. వెదజల్లిన పొలాల్లో రైతులు కలుపు నివారణకు రసాయన మందులను నిర్ణయించిన మోతాదులో సకాలంలో వాడాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ చెప్పారు.

కలుపు నివారణకు సూచనలు..

వెదజల్లిన పొలాల్లో వరిమొక్క బొడ్డు మొలవక ముందే కలుపు నివారించుకోవడం సులభతరమని ఏఓ అశోక్ సూచించారు. విత్తనాలు చల్లిన మూడు రోజులలోపు పొలంలో నీరు తీసేసి సాతి 120 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. అదే విధంగా దుంపజాతి కలుపు నివారణకు లోంబాక్స్ పవర్ మందును ఎకరానికి నాలుగు కేజీలు చొప్పున విత్తనాలు చల్లిన మూడు రోజులలోపు చల్లితే దుంపతో సహా నిర్మూలించబడుతుందన్నారు. మూడు నుంచి ఐదు రోజుల మధ్యలో స్టాప్‌స్టార్ 35 గ్రాముల మందును అరలీటరు నీటిలో కలిపి ఆ మందు ద్రావణాన్ని 20 కేజీల గోదావరి ఇసుకతో కలిపి ఎకరం పంటపై బురద పదునుపై చల్లుకోవాలన్నారు. 15 నుంచి 20 రోజులకు కలుపు ఇంకా ఉన్నట్టయితే నామినీ గోల్డ్ మందును 100 మి.లీ. మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. 15 రోజుల తర్వాత పొలంలో వుడా, జోడల గడ్డి వంటి వెడల్పాటి ఆకులు కలిగిన కలుపు మొక్కలు కనిపిస్తే 2,4–డి సోడియం సాల్ట్ 500 గ్రాములు 200 లీటర్ల నీటికి కలిపి పొలంలో పిచికారి చేయాలన్నారు. కలుపు మందులు పిచికారీ చేసేటప్పుడు పొలంలో పలుచటి నీటిపొర మాత్రమే ఉండాలన్నారు. నీరు నిలబడితే మొక్కలు చనిపోతాయన్నారు. వెదచల్లిన పొలాల్లో కలుపును సమర్థవంతంగా నివారించి తెగుళ్లను అధిగమిస్తే నాట్లు వేసిన పొలంకంటే ఎకరాకు ఐదు నుంచి పది బస్తాలు ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు.

ఖర్చులు తగ్గుతున్నాయి



వెదజల్లిన పొలంలో కూలీల అవసరం తక్కువగా ఉండటంతో ఖర్చులు తగ్గుతున్నాయి. సాధారణ విధానం కంటే వెదజల్లిన పంట ముందుగానే కోతకు వస్తుంది.

–కర్రి రామారెడ్డి, రైతు, గొల్లపాలెం.

దిగుబడి బాగుంటుంది



వెదజల్లిన పొలాల్లో రసాయన మందుల వినియోగంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి. తెగుళ్లను అధిగమించగలిగితే నాట్లు వేసిన పొలం కంటే ఎకరాకు ఐదు నుంచి పది బస్తాలు ఎక్కువ దిగుబడి అవుతుంది.

–నల్లమిల్లి దొరారెడ్డి, బందనపూడి.